క్లుప్తంగా

17, 18న ఉరుసు మహోత్సవం

చిట్వేలి : హజరత్ జనాబ్ సయ్యద్ షా సాదిక్ వలీ ఖుదస్రిహు వారి ఉరుసు మహోత్సవాన్ని ఈనెల 17, 18వ తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సయ్యద్ జిలానీ బాషా హుసేని ముత్తవల్లి ఆస్థానయే సాదిఖీయ గురువారం తెలియజేశారు. 17వ తేదీ శనివారం రాత్రి చందన మహోత్సవం పీఠాధిపతి ఇంటి నుంచి పకీరులు మేళతాళాలతో బయలుదేరి దర్గా వద్దకు తీసుకువస్తారని, 18న ఆదివారం ఉరుసు మహోత్సవం, 19న సోమవారం ఉదయం జెండా మెరవణి జరుగుతుందని తదుపరి ప్రసాద పంపిణీ ఉంటుందన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని పీఠాధిపతి కోరారు.

పూజా సామగ్రి వితరణ



పూజా సామగ్రిని అందజేస్తున్న భక్తులు

రాజంపేట : తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు, అర్చన దంపతులు గురువారం ఇత్తడి పూజా సామగ్రిని అందజేశారు. ఈ మేరకు టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. పూజా సామగ్రిని అందజేసిన దాతల పేరు మీద అర్చకులు అర్చన జరిపి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది సురేష్‌రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



విష్ణువర్ధన్, ఎస్ఐ-1, రాయచోటి అర్బన్

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ – 1గా విష్ణువర్దన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం మధ్యాహ్నం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయచోటి పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చట్టాన్ని ఉల్లంఘించి వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే శాంతి భద్రతలను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

పుల్లంపేట ఎస్ఐగా శివకుమార్



శివకుమార్, ఎస్ఐ, పుల్లంపేట

పుల్లంపేట : మండల ఎస్ఐగా శివకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మట్కా, గుట్కా, సారా తదితర వాటిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వలన కాలుష్యాన్ని నివారించవచ్చని, ఆక్సీజన్‌ను ఉత్పత్తి చేయడం జరుగుతుందన్నారు. మొక్కలు మానవ జీవనానికి దోహదపడతాయన్నారు. చెట్లు నాటడం వలన వర్షపాతాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి

కడప ఎడ్యుకేషన్ : నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల అక్రమ అడ్మిషన్లు అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ప్రాంతీయ పరవేక్షణ అధికారి బండి వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జూనియర్ కళాశాల యాజమాన్యాలు నారాయణ, శ్రీ చైతన్య పీఆర్‌ఓల ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. సదరు కళాశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. ప్రధానంగా కడప నగరంలో కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు తరగతులకు వెళ్లేదానికి సరైన దారి కూడా లేదన్నారు. కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అధిక ధరలు వసూలు చేయరాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ల డెలివరీపై అధిక ధరలను వసూలు చేయరాదని జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోల్ అధికారి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మెట్రాలజీ డే సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 20 వరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ యాక్ట్ 2009, లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్డ్ కమోడిటీ రూల్స్ 2011 గురించి అవగాహన కల్పించారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో తూకం సరిగ్గా ఉందో లేదో చూసి డెలివరీ చేయాలన్నారు. బిల్లులపై అధికంగా వసూలు చేయరాదని సూచించారు.

హామీ గుప్పించారు.. అమలు మరిచారు



అభివృద్ధికి నోచుకోని రైల్వేకోడూరు బస్టాండ్



శిథిలమైన మరుగుదొడ్లు

- ఎన్నికల వేళ ఓట్ల కోసం బస్ డిపో ఏర్పాటు అంటూ వాగ్దానం
- కూటమి అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- కనీస వసతుల నోచుకోని కోడూరు బస్టాండ్ ప్రాంగణం
- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడి ప్రజలు కోడూరులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని చాలా కాలంగా డిమాండ్ ఉన్నా ఎవరికీ పట్టడంలేదు. కూటమి ప్రభుత్వం డిపో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికి హామీ అమలు దిశగా అడుగులు పడటం లేదని కోడూరు వాసులు వాపోతున్నారు. ఇటీవల నియోజకవర్గానికి చెందిన కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌లు సీఎం చంద్రబాబు నాయుడు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. బస్టాండ్ ప్రాంగణంలో ఒక రోజు ఆడంబరంగా జేసీబీతో కంపచెట్లు తొలగించి తరువాత నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా తిరుపతి, చెన్నై, హైదరాబాదు, నెల్లూరు, గుంటూరు, విజయవాడ తదిర ప్రాంతాలకు ప్రజలు ప్రతిరోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ ప్రాంతంలో ఇక్కడి ప్రయాణికులకు తగిన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సదుపాయాలు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర వేదనకు పాడాల్సిన దుస్థితి దాపురించింది. కాగా పట్టణంలో బస్టాండ్ ప్రాంగణాన్ని 1993లో అప్పటి ప్రభుత్వం పెద్దలు ప్రారంభించారు. మొదట్లో బాగానే ఉన్న రానురాను నిర్లక్ష్యానికి గురై ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఈ బస్టాండ్ కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉంటుంది. దశాబ్దాల కాలంగా కోడూరు బస్ డిపో ఏర్పాటుకు ప్రజా సంఘాలు, ప్రజలు పోరాడుతూ ఉన్నారు.

బస్టాండ్‌లో నామమాత్రపు సౌకర్యాలు

బస్టాండ్‌ను పునరుద్ధరించినా అక్కడ సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయి. ఎవరూ పట్టించుకోవడంలేదు. బస్సులు వస్తూ వెళుతున్నప్పటికీ ప్రయాణికుల కోసం సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. అప్పటి మరుగుదొడ్లు కావడంతో అధ్వానంగా ఉన్నాయి. బస్టాండ్‌లో ప్రయాణికులకు కుర్చీలుగా బస్సులోని సీట్లను అమర్చారు. బస్టాండ్ పైకప్పు దెబ్బతిని వర్షాకాలంలో వర్షం పడుతూ ఉంటుంది. బస్టాండ్‌కు ప్రహరీ లేక రక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వంలో చలనం వచ్చి ప్రత్యేకంగా నిధులు కేటాయించి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి మండిపల్లిపై అసంతృప్తి

అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ప్రజలు జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లకు మహర్దశ పడుతుందని ఆశించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా డిపో ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టకపోవడంతో కోడూరు వాసుల్లో అసంతృప్తి కనిపిస్తోంది. డిపో సంగతి పక్కన పెడితే కనీసం ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కూడా జరగకపోవడంతో జిల్లాకు చెందిన ఏకైక మంత్రి.. అది రవాణా శాఖ బాధ్యతలు చూస్తున్నా కోడూరుకు కూటమి నాయకులు హామీ ఇచ్చిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది. కోడూరులో బస్ డిపో అందుబాటులోకి వస్తే గంటల తరబడి బస్సుల కోసం వేచి వుండే అవసరం లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవచ్చనే ఆశ కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే, నియోజకవర్గ నాయకుల నిర్లక్ష్యంతో ఇప్పట్లో జరగదనే భావన ఈ ప్రాంతవాసుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

డిపో ఏర్పాటు చేయాలి



ఉద్యాన కేంద్రంగా కోడూరు ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి నర్సరీలకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు తదితరులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లగా కోడూరు బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూనే ఉన్నారు. నాయకుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడంలేదు.

– దార్ల రాజశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి, రైల్వేకోడూరు

రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఇబ్బంది



కోడూరులో బస్టాండ్ ఉందా అంటే ఉంది అని లేదా అంటే లేదు అనేలా ఉంది మా పరిస్థితి. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఉన్న బస్టాండ్‌లో ఎటువంటి సౌకర్యాలు లేవు. కనీసం బస్టాండ్ ప్రాంగణానికి ప్రహరీ లేక రక్షణ కరువైంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి.

– రత్తయ్య, రంగనాయకులపేట, రైల్వేకోడూరు

తిరుపతి, నెల్లూరుకు వెళ్లాలంటే ఇబ్బందులు



కోడూరు నుంచి తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాలకు ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు వేలాది మంది నిత్యం ప్రయాణిస్తుంటారు. ఇక్కడి నుంచి కానీ, ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి కానీ రాత్రివేళలో ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నాం. డిపో ఏర్పాటైతే ఏ సమయంలోనైనా బస్సులు అందుబాటులో ఉంటాయి.

– డి.సుదర్శన్, న్యాయవాది, రైల్వేకోడూరు

రేపు ఈడిగపల్లెలో కొత్తపురమ్మ తిరునాల

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లెలో వెలసిన ఆదిపరాశక్తి కొత్తపురమ్మ తిరునాలను శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యుత్ దీపాలంకరణలతో చాందినీబండ్లు ప్రదక్షిణలు చేస్తాయని వారు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

వైసీ పల్లి ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

నందలూరు : మండలంలోని మారుమూల ప్రాంతమైన ఎర్ర చెర్లోపల్లి (వైసీ పల్లి) ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడినట్లు ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు, ఈఓపీఆర్‌డీ సునీల్‌కుమార్‌లు తెలియజేశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ వార్డు మెంబర్లు హాజరుకాని కారణంగా ఎన్నిక వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ఎన్నిక జరిగే తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

దక్షిణ ఫౌండేషన్‌కు విద్యార్థుల ఎంపిక

రాజంపేట : దేశవ్యాప్తంగా దక్షిణ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన పరీక్షలో జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే విద్యాలయం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గత మార్చిలో ఎంపిక పరీక్షలు నిర్వహించారన్నారు. ఐఐటీల్లో ప్రవేశం కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. రాబోయే రెండు సంవత్సరాల పాటు కర్నూలు, కర్ణాటకలోని బెంగళూరు, కేరళలోని కొట్టాయం నవోదయ విద్యాలయాల్లో ఐఐటీ కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

కొత్తపురమ్మ జాతరకు పోటెత్తారు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ కొత్తపురమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మొక్కులు తీరిన భక్తులు చాందినీ బండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు తీశారు. కోలాటాలు, చెక్కభజనల నడుమ వైభవంగా బోనాలు సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో కొత్తపురమ్మ



ఆకట్టుకున్న ఎద్దుల చాందినీ బండి



జాతరకు పోటెత్తిన భక్తులు

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెలో వెలిసియున్న శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయంలో సప్తమ వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. సీనియర్ నాయకుడు రంగారెడ్డి, వండాడి సర్పంచ్ ముసల్‌రెడ్డి, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఆలయంలో మూడు పూటలా ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కల్యాణం సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్ మూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ క్రతువులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం

ఘనంగా గంగ జాతర



ఆలయం వద్ద పొంగుబాళ్లు పొంగిస్తున్న మహిళలు

పెనగలూరు : మండలంలోని ఓబిలి పంచాయతీ, అత్తిగారిపల్లిలో గురువారం గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిపారు. రెండు రోజుల పాటు జరిగిన జాతరలో గ్రామస్తులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి ఆసాదు కథ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వంద సంవత్సరాలు తరువాత జాతరను చేయడంతో గ్రామస్తులు వేడుకగా జరుపుకున్నారు. భక్తులు ప్రతి ఇంటిలో పొంగుబాళ్లు పొంగించి తమ భక్తిని చాటుకున్నారు. బుధవారం రాత్రి పోతులూరయ్య ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి పూజలు చేశారు. వంద సంవత్సరాల తరువాత జాతరను నిర్వహించడంతో ప్రతి ఇంటికి పెద్దఎత్తున బంధువులు వచ్చి సందడి చేశారు.

భక్తి శ్రద్ధలతో రేణుక ఎల్లమ్మకు బోనాలు

సిద్దవటం (ఒంటిమిట్ట) : రేణుకా ఎల్లమాంబ తిరునాల సందర్భంగా మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన రేణుకా ఎల్లమాంబకు గురువారం శాంతినగర్, మాచుపల్లి గ్రామ మహిళలు పెద్దఎత్తున పాల్గొని డప్పు వాయిద్యాల మధ్య బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు అందజేశారు.



భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం మండలంలోని మాచుపల్లిలో వెలసిన జగజ్జనని శ్రీరేణుకా ఎల్లమాంబ తిరునాలు సందర్భంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. కవ్వా బాలయ్యకు చెందిన ఎడ్లు, ద్వారకాల గురివిరెడ్డి ఎడ్లు మొదటి స్థానంతోపాటు మూడవ స్థానం (రెండు జతల ఎడ్లు), కుందూరు రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎడ్లు రెండవ స్థానం, రామాంజనేయులుకు చెందిన ఎడ్లు నాలుగు, ఐదు స్థానంలో నిలిచాయి (రెండు జతల ఎడ్లు పాల్గొన్నాయి). విజేతలకు బహుమతులను నిర్వాహకులు అమ్మవారి ఆలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రసవత్తరంగా సాగుతున్న బండలాగుడు పోటీలు

రేపు కల్యాణ మహోత్సవం



జె.వడ్డిపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పందిళ్లపల్లి గ్రామం జె.వడ్డిపల్లిలో ఈనెల 17వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించ తలపెట్టినట్లు గ్రామ ప్రజలు తెలియజేశారు. కల్యాణోత్సవానికి మండలంలోని భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది అన్నప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

ఏపీజీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

వీరబల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రైతులకు, బ్యాంకు ఖాతాదారులకు ఆపద్బాంధవుడు లాంటిదని రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ షారో తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకును వారు ప్రారంభించారు. ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు క్రాప్ లోన్లు రెండు లక్షల రూపాయల వరకు ఎటువంటి షూరిటీ లేకుండా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అన్ని రకాల రుణాలు పొందవచ్చని, డిపాజిట్లపై అధిక వడ్డీరేట్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా ఏటీఎం కార్డు వినియోగిస్తూ ప్రమాదంలో మృతి చెందితే అటువంటి వారికి ఇన్సూరెన్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. వీరబల్లిలో ఏర్పాటైనా బ్యాంకు సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మనోజ్, బ్యాంకు సిబ్బంది, రైతులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



ఏపీజీబీ నూతన శాఖను ప్రారంభిస్తున్న ఆర్ఎం సుశాంత్

‘స్వచ్ఛత’పై చిత్తశుద్ధి కరువు



పట్టణంలోని రాజులకాలనీలో పూడుకుపోయిన మేజర్ డ్రైయిన్



ఫ్రూట్స్ మండీ సమీపంలో పేరుకుపోయిన చెత్త

- రాయచోటిలో గాడితప్పిన పారిశుద్ధ్యం
- చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయిన్లు
- ప్రధాన కూడళ్లలోనే స్వచ్ఛతా కార్యక్రమాలు, ప్రతిజ్ఞలు

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర అంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం, ప్రధాన కూడళ్లలో స్వచ్ఛతా కార్యక్రమాలు, స్వచ్ఛతా ప్రతిజ్ఞలు చేస్తున్నా రాయచోటి మున్సిపాలిటీలో పరిశుభ్రత, స్వచ్ఛతా ఎక్కడా కానరావడం లేదు. డ్రెయిన్లు (మురుగు నీటి కాలువలు) పూడుకుపోయి చెత్త కుండీలను తలపిస్తున్నాయి. డ్రెయిన్లలో చెత్త, పూడికలు పేరుకుపోవడంతో మురుగునీరు ఎటూ కదలక దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీనికి తోడు మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో చెత్త విపరీతంగా ఎక్కడ చూసినా పేరుకుపోయింది. ఈ సమస్యపై ప్రతి వార్డు కౌన్సిలర్ ఆందోళన చెందుతున్నారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అంచనా వేయవచ్చు.

243 కిలోమీటర్ల మేర విస్తరించిన డ్రెయిన్లు

రాయచోటి మున్సిపాలిటీలో అన్ని రకాల డ్రెయిన్లు కలిపి దాదాపు 243 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇందులో మేజర్ డ్రెయిన్లు అంటే మెయిన్ అవుట్ లెట్ల పరిస్థితే అధ్వానంగా ఉంటే ఇక మైనర్ డ్రెయిన్ల నిర్వహణ ఏ రకంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. పారిశుద్ధ్యం అంటే ఉదయాన్నే రోడ్లను, వీధులను పరిశుభ్రం చేసి ఇళ్ల నుంచి చెత్తను సేకరించడమే అనుకుంటున్నారు సంబంధిత అధికారులు. డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా ఉంటేనే పరిసర ప్రాంతాలు, అక్కడ ఉండే నివాసితులు గాలి, నీరు కలుషితం కాకుండా స్వచ్ఛతతో కూడిన పరిసరాల్లో ఆరోగ్యంగా జీవించగలరన్న వాస్తవాన్ని పారిశుద్ధ్య సిబ్బంది గ్రహించడం లేదు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగంలో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో దాదాపు 250 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా రోజూ విధులు నిర్వహిస్తున్నట్లు హాజరు పట్టికల్లో ఉన్నా హాజరు నమోదైన తర్వాత కొందరు వెళ్లిపోతున్నారని ఇదంతా పారిశుద్ధ్య అధికారుల పర్యవేక్షణ లోపమనే ఆరోపణలు ఉన్నాయి. ఇక పారిశుద్ధ్య కార్మికులు తమకు కేటాయించిన పనులను చేసుకుంటూ వెళ్తున్నారు. కాని పారిశుద్ధ్యం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

నిరంతర పర్యవేక్షణ కరువు

రోజుకు మున్సిపాలిటీ చెత్తను తోడ్కొని వెహికల్ ట్రాక్టర్లు, టిప్పర్లతో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు పారిశుద్ధ్య పనులు కొనసాగినా ఉదయం 10 గంటలకు కొన్ని ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్న ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని, డ్రెయిన్ల శుభ్రతను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య విభాగం అధికారులు పర్యవేక్షించాలని పలువురు సూచిస్తున్నారు. రోజుల తరబడి డ్రెయిన్లను పరిశుభ్రం చేయకపోవడం వల్ల డ్రెయిన్లలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం చేరి పూడికలు పేరుకుపోతున్నాయి.

ప్రజల సహకారంతోనే పరిశుభ్ర రాజంపేట

రాజంపేట : పట్టణంలో డోర్ టు డోర్ చెత్త సేకరణకు సంబంధించి ప్రజలతో నేరుగా కలిసి తెలుసుకోవడం జరుగుతోందని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలో చెత్త సేకరణ ప్రక్రియపై ఆయన దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యంలో భాగంగా ఇంటి వద్ద చెత్తబండ్లు వస్తున్నాయా లేదా అని ప్రజల వద్ద ఆరా తీశారు. చెత్త వేర్వేరుగా ఇవ్వడం వల్ల పునఃప్రయోజనానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. పరిసరాల శుభ్రతకు ఇది ఎంతో అవసరమన్నారు. తడి చెత్తను గ్రీన్, పొడిచెత్తను బ్లూ బిన్‌లో ఇవ్వాలన్నారు. పట్టణం పరిశుభ్రంగా మారాలంటే పట్టణవాసులు పురపాలక సంఘానికి సహకరించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



చెత్త సేకరణపై ఆరా తీస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నేడు కౌన్సిల్ సమావేశం

పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శుక్రవారం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్ సమావేశం ఉంటుందన్నారు. కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు.

జెడ్‌హెచ్‌డీసీ భూములను పేదలకు పంచాలి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ భూములు కబ్జాలను తొలగించి అర్హులైన పేద దళితులకు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి చింతల పూడి నాగమ్మ అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జెడ్‌హెచ్‌డీసీ భూముల గ్రామాల పేదలకు లీజు పట్టాలు గతంలో మంజూరు చేశారన్నారు. దీంతో వారు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. అయితే కొందరు భూమి సాగు చేయకుండా ఖాళీగా ఉంచారని, దీంతో కబ్జాదారులు కన్ను వాటిపై పడిందన్నారు. భూ కబ్జాదారులు స్థానికులతో కలిసి భూములను దొంగలీజు పట్టాలను సృష్టించి లక్షల కోట్ల రూపాయలకు క్రయవిక్రయాలు నిర్వహించారని ఆరోపించారు. జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు క్షేత్రస్థాయిలో కబ్జాలకు పాల్పడిన భూములు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకొని అర్హులైన వారిని గుర్తించి రాజంపేట సబ్ కలెక్టర్ న్యాయం చేయాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో నిజమైన లబ్ధిదారుల రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి నాగమ్మ